## వైభవంగా కాళికామాత ఉత్సవాలు

**చౌడాపూర్ జూన్19,ప్రభాతవార్త :** చౌడపూర్ మండల పరిధిలోని మకత వెంకటాపూర్ గ్రామంలో కాళికాదేవి మాత ఉత్సాహాలు ఎంతో వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా శ్రీశ్రీ కాళికాదేవి మాత అమ్మవారిని మండల ఎంఆర్ఓ ప్రభులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లింగయ్య, సీనియర్ అసిస్టెంట్ వెంకటగిరి,వెంకట్, అంజు నాయక్,శివ పవార్,ఆనంద్,రాజేందర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


కాళిమాతకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## కలెక్టర్‌కు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు

**బొంరాస్‌పేట్,జూన్19,ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ బాధ్యతలు స్వీకరించడంతో బొంరాస్‌పేట్ మండలంలో పనిచేస్తున్న రెవేన్యూ ఆర్ఐలు ఆయనకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలిసి పుష్పగచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రవీందర్‌చారి, రవినా యక్,రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్ఐలు

# అవినీతికి తావు లేకుండా పనిచేయాలి

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**తాయ్‌బజార్ ఎత్తివేత**

**పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలి**

**పెద్ద చెరువు సుందరీకరణకు రూ.20కోట్లు మంజూరు**

**నియోజకవర్గంలో 3500 ఇండ్లు నిర్మాణం**

**ఇబ్రహీంపట్నం, జూన్ 19, ప్రభాతవార్త:** ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండ అధికారులు విధులు నిర్వహించాలని ఇబ్రహీంపట్నం వర్తకవ్యాపారుల సమస్యలపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెప్పారు. ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో బుదవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని వర్తకవ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాయ్‌బజార్‌తో సామాన్య ప్రజలు, చిరువ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారని దీంతో తాయ్‌బజార్ ఎత్తివేసినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని దుఖాణాదారులు అధికారులకు సహకరించాలని, ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది కలగకుండ వ్యాపారం చేసుకోవాలని చెప్పారు. దుఖాణదారులనుండి మున్సిపాలిటీ అధికారులు ట్రేడ్ లైసెన్సులకు అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని తెలపడంతో వెంటనే ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు. మరోమారు ఇలాంటి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. అదేవిదంగ మున్సిపాలిటీలో ఎవరైన అధికారులు అక్రమ వసూల్లకు పాల్పడితే వెంటనే పోలీసులకు, గాని సంబంధిత శాఖ పై అధికారులకు, లేద తనకు ఫిర్యాధు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని వెంటనే అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలని అదేశించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ కప్పరి స్రవంతిచందు, వైస్ ఛైర్‌పర్సన్ బర్ల మంగజగదీష్వర్, మున్సిపాలిటీ కమీషనర్ రవీంద్రసాగర్, ఎసిపి కె.పి.వి రాజు, సిఐ సత్యనారాయణ ఉన్నారు.

**రూ.20కోట్లు మంజూరు..**

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు సుందరీకరణకు ప్రభుత్వం నుండి రూ.20కోట్లు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెప్పారు. పెద్దచెరువు సుందరీకరణతో పర్యాటక ప్రాంతంగా ఏర్పడనుందని తెలిపారు. అదేవిదంగా ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని త్వరలో ఇబ్రహీంపట్నం కట్ట నుండి శాస్త్ర గార్డెన్స్ వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు తెలిపారు.


ఇబ్రహీంపట్నం వర్తకవ్యాపారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**నియోజకవర్గంలో 3500 ఇండ్లు నిర్మాణం**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గత ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని చెప్పి ఏవక్కరికి ఇవ్వలేదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విమర్శించారు. ఈ ఏడాది నియోజకవర్గంలో అర్హులైన 3500 మంది లబ్ధిదారులకు ఇంటినిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు చెప్పారు. వచ్చే ఐదేండ్లల్లో నియోజకవర్గంలోని ప్రతిఒక్క అర్హునికి సోంత ఇంటి కలనురవేరుస్తామని హామీనిచ్చారు. వచ్చే నెల నుండి అర్హులైన ప్రతిఒక్కరికి రేషన్ కార్డు, పెన్షన్‌లను అందచనున్నట్లు వివరించారు.

**ఇబ్రహీంపట్నం ఎలిమినేడు రోడ్డు ప్రారంభం**

ఇబ్రహీంపట్నం నుండి ఎలిమినేడు, బోంగుళూరు ఆర్ అండ్ బి రోడ్డును ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బుదవారం ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని అన్నారు. జెడ్పిటిసి మహిపాల్, ఎంపిపి కృపేష్, ఎంపిటిసి ఆంజనేయిలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులున్నారు.


నల్లవెల్లి ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

## యాచారంలో కోటి రూపాయల అభివృద్ధి పనులు ప్రారంభం

**యాచారం జూన్19,ప్రభాతవార్త :** యాచారం మండలంలో కోటి రూపాయల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే అధికారుల పని తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు.బుధవారం అభివృద్ధి పనులపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపిపి సుకన్య భాష,జడ్పిటిసి జంగమ్మ యాదయ్య, ఆయా గ్రామాలలో మంతన్ గౌరెల్లిలో 40 లక్షల నిధుల పనులను ఎంపిటిసి జ్యోతి అరవింద్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. కెసి తండా గ్రామంలో 13 లక్షల సిసి రోడ్డు ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి ప్రారంభించారు.నల్లవెల్లి గ్రామంలో 45 లక్షలతో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులు ఎంపిటిసి ఈదులకంటి లక్ష్మీపతి గౌడ్‌తో కలిసి ప్రారంభోత్సవం చేశారు. అదేవిధంగా చింతపట్ల గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో నరేందర్ రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప,పంచాయతీ రాజ్ ఉస్మాన్ ఖాన్,వివిధ గ్రామాల సెక్రటరీలు,నాయకులు,మాజీ ఎంపిపిలు,రాచర్ల వెంకటేశ్వర్లు, జ్యోతి శ్రీనివాస్ నాయక్,చిలక మదుసూధన్ రెడ్డి,బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి,ఉప్పల భాస్కర్ గుప్తా,పాండురంగారెడ్డి, మధుకర్ నాయక్,వరికుప్పల సుధాకర్,గౌరారం వెంకట రెడ్డి,భాస్కర్ ,మాజీ ఎంపిటిసి మోట్ శ్రీశైలం ప్రభుత్వ అధికారులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## కోటపల్లి మార్కెట్ కమిటీకి ఎల్లప్పుడు సహకారం ఉంటుంది

**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**పెద్దేముల్, జూన్ 19, ప్రభాతవార్త:** కోటపల్లి మార్కెట్ కమిటికి ఎల్లప్పుడు తన సహకారం ఉంటుందని తెలంగాణ అసెంబ్లి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. కోటపల్లి మార్కెట్ కమిటి నూతన పాలకవర్గం నియామకం చేసిన సందర్భంగా చైర్మెన్ గడ్డకింది అంజయ్య, వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు బుదవారం హైద్రాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ రైతులకు మేలు జరిగే విధంగా పాలన అందించాలని సూచించారు. కోటపల్లి మార్కెట్‌కమిటి అభివృద్ధికి పాలకవర్గం కృషిచేయాలని, తన సహకారం కూడా ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. స్పీకర్‌ను కలిసిన వారిలో డైరెక్టర్లు హరిసూధన్‌రెడ్డి, ఇక్బాల్, అక్బర్, బందెయ్య, టి,నర్సిములు, యు. రమేష్, రియాజోద్దిన్ తదితరులు ఉన్నారు.

## జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడి టీచర్లకు శిక్షణా కార్యక్రమం

**నైపుణ్యం సాధించి పిల్లలకు బోధించాలి**

**మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య**


కలెక్టరేట్‌లో అంగన్‌వాడి టీచర్లకు శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య ప్రారంభించగ, పాల్గొన్న జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19, ప్రభాతవార్త**

జిల్లా వ్యాప్తంగ అంగన్‌వాడి టీచర్లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, టీచర్లు శిక్షణలో నైపుణ్యం సాధించి పిల్లలకు బోధనను అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో అంగన్‌వాడి టీచర్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగ అంగన్‌వాడి టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు ఆరంభమైనాయి. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య మాట్లాడుతూ అంగన్‌వాడి టీచర్లకు పూర్వ ప్రాధమిక విద్యపై శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. 3-6సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి వారికి పూర్వ విద్యను అందించాలన్నారు. పూర్వ ప్రాధమిక విద్య,సంరక్షణ, విద్యకు సంబంధించిన నూతన జాతీయ పాఠ్యప్రణాళికలకు అనుగుణంగ పాఠ్యప్రణాళిక మార్పులు చేయటం జరిగిందన్నారు. పిల్లలకు విజ్ఞానాన్ని, విద్యను అందించి అంగన్‌వాడి కేంద్రాలను ఆదర్శ కేంద్రాలుగా మార్చాలని అభిషేక్ ఆగస్త్య సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగ 742 అంగన్‌వాడి కేంద్రాలకు సంబంధించి ఈ నెల 19వ తేదీ నుంచి 29వరకు మూడు రోజుల పాటు చొప్పున బ్యాచ్‌లుగా అంగన్‌వాడి టీచర్ల అందరికి శిక్షణ ఇవ్వటం జరుగుతుందని ఆయన తెలిపారు. అందరు శిక్షణా కార్యక్రమాలకు ఖచ్చితంగ హాజరు కావాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. ఈ శిక్షణా ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

**ఘట్‌కేసర్, జూన్ 19, ప్రభాతవార్త:** నిత్యం పారిశుద్య పనులు చేపడుతున్న కార్మికులకు 10 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం మర్రిపల్లిగూడ గ్రామపంచాయతీ కార్యలయం వద్ద బుధవారం కార్మికులు వేతనాల కోసం నిరసన వ్యక్తం చేశారు. ఎంపిపి సుదర్శన్‌రెడ్డి చేరుకొని కార్మికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మాయ నరేశ్, నాయకులు బసవ రాజుగౌడ్, చిలుగూరి లక్ష్మణ్, గుండె నరేశ్, బాలు యాదవ్, శంకర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## జన్నాయగూడం రైతులకు న్యాయం చేస్తాం : కోదండారెడ్డి

**రైతులతో సమావేశమైన మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ శాసన సభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి**

**మహేశ్వరం,జూన్ 19 ప్రభాతవార్త :** రావిర్యాల రెవెన్యూ పరిధిలోని జన్నాయగూడం పరిధిలోని 160 ఎకరాల వివాదస్పద భూముల సమస్యను త్వరలో పరిష్కరించడానికి జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకురావడం జరిగిందని స్థానికంగా వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మాజీ శాసన సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి నాయకులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి గ్రామస్తులకు వివరించారు. స్థానికంగా జన్నాయగూడంలో వ్యవసాయం చేసుకుంటున్న రైతులతో కలిసి తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. స్థానికంగా రైతులు గత 20 సంవత్సరాలుగా ఈ భూమిపై పట్టా హక్కులు లేకుండపోవడంతో ఈ భూములపై బ్యాంకులు, ఇతరాత్ర రుణ సదుపాయాలు రావడం లేదని రైతులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ భూముల పట్టాలు పూర్తిగా తెలంగాణ పరిశ్రమల శాఖ పరిధిలోకి వెళ్లడంతో గత 20 సంవత్సరాలుగా ఈ భూములు తమకే కేటాయించాలని గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దృష్టికి తీసుకురావడం జరిగింది. 20 సంవత్సరాలుగా ప్రభుత్వానికి రైతులకు మధ్య అంగీకారం కుదరకపోవడంతో సమస్య రోజురోజుకు జఠిలంగా మారుతు వస్తుంది.

అయితే ఇటీవల కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక దృష్టిసారించారు. అందులో భాగంగానే ధరణీ పోర్టల్ విభాగంలో కీలక భాద్యత నిర్వహిస్తున్న మాజీ శాసన సభ్యులు కోదండా రెడ్డిని జన్నయగూడం గ్రామానికి తీసుకువచ్చి రైతులతో సమావేశమైయ్యారు. ఇది ఇలా ఉండగా ఈ భూ సమస్యపై పూర్తిగా అవగాహన కలిగిన కోదండారెడ్డి స్థానికంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఇన్నాళ్లుగా ఈ భూ సమస్య పరిష్కారం కాకపోవడానికి కారణం స్థానికంగా కొన్ని రాజకీయ నాయకుల జోక్యం, రైతులు కూడా ఓ నిర్ణయానికి రావాలని సూచనలు ఇచ్చారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో మరోసారి ప్రభుత్వ జిల్లా మంత్రి, రాష్ట్ర సంబంధిత అధికారులతో సుదీర్ఘ చర్చలు జరిపి రైతులకు తగిన న్యాయం జరిగేవిధంగా కృషిచేస్తామని కోదండారెడ్డి తెలిపారు. కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మాత్రం సాగు చేసుకుంటున్న రైతులకు సముచిన న్యాయం జరగాలని కోరారు.


చైతన్యనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

## ఆదివాసిలను సికిల్‌సెల్ ఎనిమియా నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యం

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్**

**పెద్దేముల్, జూన్ 19, ప్రభాతవార్త:** ఆదివాసి సముదాయాలకు చెందిన ప్రజల జీవితాలకు సెకిల్‌సెల్ ఎనిమియా నుంచి విముక్తి కల్పించి ఆరోగ్యభద్రత కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్ అన్నారు. ప్రదానమంత్రి జన్‌మన్‌కార్యక్రమంలో భాగంగా బుదవారం పెద్దేముల్ మండలం చైతన్యనగర్‌లో సికిల్‌సెల్ ఎనిమియా అవగాహన దినంగా జెండా ఊపి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ పాల్వాన్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలో సికిల్‌సెల్ ఎనిమియాను నిర్మూలించాలనేలక్ష్యంతో వికారాబాద్‌తో పాటు 13 జిల్లాలలో సికిల్‌సెల్ ఎనిమియా ఎలిమినేషన్ కార్యక్రమాలు ప్రారంబించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఆదివాసిజనాభా అధికంగా ఉన్న జిల్లాలలో ఈ కార్యక్రమాలు ప్రారంభించినట్లు చెప్పారు. సికిల్‌సెల్ ఎనిమియా నుంచి విముక్తి కల్పించడమే ప్రభుత్వ ముఖ్యఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మల్లేశం, ప్రోగ్రాం అధికారి మల్లేశం, ప్రోగ్రాం అధికారి డాక్టర్ బుచ్చిబాబు, మండల పంచాయతీ అధికారి, సెక్రెటరి, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

"కొండం'త సంబురం..

## ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కి ఘన స్వాగతం

**-ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరిచి గెలుపు రుణం తీర్చుకుంటా..: కొండా**


చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి గజ మాలతో స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

**వికారాబాద్,జూన్ 19, ప్రభాతవార్త:** ఈ మద్య జరిగిన చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కి వికారాబాద్ బీజేపీ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. గెలుపొందిన తర్వాత మొట్ట మొదటి సారి వికారాబాద్‌కు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రావడంతో పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా నుంచి కొండా బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. దారి పొడుగునా పూలు కురిపిస్తూ, గజమాలతో సత్కరించారు. అనంతరం కొండా బాల కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్లో పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, తన ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. ఎవరూ ఊహించని రీతిలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరుస్తానని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు సైతం అలుపు ఎరుగని రీతిలో కష్టపడి తన గెలుపునకు కృషి చేశారని, వారిని సైతం అక్కున చేర్చుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కోకట్ మాధవరెడ్డి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్ల నందు, బీజేపీ రాష్ట్ర నాయకులు శివరాజ్, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలి : అదనపు కలెక్టర్


నులిపురుగుల మాత్రల పంపిణీ గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, అధికారులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, జూన్ 19 ప్రభాతవార్త :** నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణి పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ సూచించారు. ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికి ఈ నెల 20న తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలన్నారు. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో కరపత్రాలు, గోడపత్రికలను అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... నులి పురుగుల వల్ల పిల్లలలో ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు వారు లోనవుతారని అన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ప్రతియేటా రెండు పర్యాయాలు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణి చేయిస్తోందని తెలిపారు.ఇందులో భాగంగా ఈ నెల 20న జిల్లా వ్యాప్తంగా అన్ని వసతి గృహాలు, విద్యా సంస్థలు,అంగన్‌వాడి కేంద్రాల్లో పిల్లలు, కిశోర బాలబాలికల సంఖ్యకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ జరిగేలా పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఏవైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన వారికి జూన్27వ తేదీన అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన 8లక్షల 9వేల మంది పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయడానికి 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 1774 మంది ఆరోగ్య సిబ్బంది మరియు అంగన్‌వాడి సిబ్బందితో టిచర్లను సమన్వయం చేసి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నట్లు తెలిపారు.

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయించేలా అవగాహన కలిగించాలని, గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా తెలియచెప్పాలని, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ హాస్టల్లో, గురుకులాలు, అంగ న్‌వాడి కేంద్రాల్లో పిల్లలందరిఇకి అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్ వాడి కేంద్రాల్లో వందశాతం పిల్లలకు టాబ్లెట్ వేసేలా కార్యాచరణ ఉండాలని, ఆ రోజు పిల్లలు తప్పనిసరిగా హాజరయ్యే విదంగా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. అన్నం తిన్న తరువాత ఒకటి నుండి 2 సంవత్సరాల పిల్లలకు సగం టాబ్లెట్ పొడి చేసి,2 నుండి 3 సంవత్సరాల పిల్లలకు ఒక టాబ్లెట్ పొడి చేసి, 3 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర నమిలి మింగే విధంగా వేయాలని సూచించారు. ఈ కారక్రమం నాటికి నూరుశాతం విజయవంతమయ్యేలా వైద్య, విద్యా శాఖతో పాటు ఐసీడిఎస్, సంక్షేమ శాఖల అధికారులు అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, జడ్పిసీఈవో కృష్ణరెడ్డి, డిపిఓ సురేష్, మోహన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి పద్మజ రమణ, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి, సంబంధిత జిల్లా అధికా రులు,వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కడ కింద మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నా నాయక్‌తో కలిసి నారాయణపేట్,వికారాబాద్ జిల్లాల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు తమ శాఖలకు నిర్దేశించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు.మంజూరై అయిన పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులకు పూనుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల విస్తరణ,రోడ్ల బలోపేతంకు సంబంధించి పంచా యతీ రాజ్,ఆర్ అండ్ బి శాఖల ఇంజనీయర్లు ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ కాలేజీల నిర్మాణం నిమిత్తం భూసేకరణ చేపట్టాలని, భూసేకరణ విషయంలో ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. కొడంగల్‌లో నిర్మించే అతిథి గృహమునకు సంబంధించి నమూనాను రూపొందించి టెండర్లకు పిలవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల నిర్మాణాల నమూనాలు, వైద్యుల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. గృహ జ్యోతి పథకం కింద దారిద్రరేఖకు దిగువనున్న పేద కుటుంబాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించే దిశగా పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. మిషన్ భగీరథ కింద ప్రతి ఇంటికి మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నీటి ట్యాంకుల నిర్మాణాలకు ,పైపులైన్ల పనుల నిమిత్తం అవసరమైన నిధుల నిమిత్తం ప్రతిపాదన పంపాలని కలెక్టర్ తెలిపారు.కడ కింద నియోజకవర్గంలో మంజూరైన చెక్ డ్యాంల నిర్మాణ పనులపై,అటవీశాఖ భూముల్లో జరుగుతున్న పనులపై కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించిన గురుకుల పాఠశాలలు స్థానికంగా ఉండేలా అదేవిధంగా వసతి గృహాల నిర్మాణాలకై స్థల సేకరణ చేపట్టి వివిధ సంక్షేమ శాఖలకు కేటాయించాలని తాండూరు ఆర్డీవోకు సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్,కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తాండూరు ఆర్డివో శ్రీనివాస్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్



మిర్యాల శ్రీను పరామర్శిస్తున్న దృశ్యం

## బాధిత కుటుంబానికి పాండు ప్రసాద్ ఆర్థిక సాయం

**తలకొండపల్లి, జూన్ 19, ప్రభాతవార్త** గత రెండు రోజుల క్రితం తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన మిర్యాల శ్రీను ద్విచక్రవా హనంపై అదుపుతప్పి బోల్తా పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న తలకొండపల్లి బిజెపి రంగారెడ్డి జిల్లాకార్య దర్శి శాలమోని పాండుప్రసాద్ సహకారంతో మిర్యాల శ్రీను భార్యకు అం దజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెవైఎం మండల అధ్యక్షుడు ఈసరి శ్రీకాంత్ బొల్లా శ్రీనివాసులు స్థానిక నాయకుల తదితరులు పాల్గొన్నారు.

## ఓం శ్రీస్వామియే శరణమయ్యప్ప

### ఆధ్యాత్మిక సేవలో విఎన్ఆర్

### అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి లక్ష విరాళం



నందిగామ అయ్యప్ప దేవాలయంలో గురుస్వామి గిరీష్‌నాయర్‌కు విరాళం అందజేస్తున్న వంకాయల నారాయణరెడ్డి

**నందిగామ, జూన్ 19, ప్రభాతవార్త** నందిగామ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి బిఆర్ఎస్ సీనియర్ నేత షాద్‌నగర్ మాజీ ఏఎంసి చైర్మన్ వంకాలయ నారాయణరెడ్డి బుధవారం గురుస్వామి శ్రీ గిరీష్ నాయర్ కు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ అయ్యప్ప అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి తన వంతు ఉడత భక్తిగా విరాళం అందజేసే భాగ్యం రావడం తన ఊర్వ జన్మసుకృతమన్నారు. ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ వంకాయల రాంరెడ్డి బుర్రి కృష్ణారెడ్డి జిల్లెల్ల బాల్‌రెడ్డి బంటారం సుదర్శన్‌గౌడ్ ఎదిరే శ్రీకాంత్ గౌడ్ మల్లేష్ యా దవ్ తుమ్మల నరసింహులు యాదవ్ గంగిశెట్టి రాములు తదితరులు ఉన్నారు.

## ఘనంగా రాహుల్‌గాంధీ జయంతి వేడుకలు

**తలకొండపల్లి, జూన్ 19, ప్రభాతవార్త** కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత ఏఐసిసి మాజీ అధ్యక్షుడు ఎంపి రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా తలకొం డపల్లి మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన తలకొండపల్లి మండల కేంద్రంలో కేక్ కటింగ్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తలకొండపల్లి మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యా రు. అదేవిధంగా రాష్ట్ర కిసాన్ సెల్ నాయకులు మోహన్‌రెడ్డి డిసిసి నాయకులు అంజయ్య గుప్తా అసెంబ్లీ కార్యదర్శి రవీందర్ యాదవ్ కల్లకుర్తి సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎండి అజీమ్ మైనార్టీ సెల్ అధ్య క్షుడు ఎండి హరీఫ్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నకేశవులు ఎన్ఎస్ యూఐ మండల అధ్యక్షుడు రమేష్ నాయక్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ డేవిడ్ డిగ్రీ కృష్ణ హరిమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ వారి సంస్థల సేవలు భేష్

### కేశంపేట జడ్పిటీసీ తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి



**కేశంపేట, జూన్ 19, ప్రభాతవార్త** కేశంపేట మండలపరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ వారి సౌజన్యంతో లైబ్రరీ ప్రాజెక్టులో భాగంగా కేశంపేట మండలంలోని 21 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు లైబ్రరీ రాక్స్ మరియు బుక్స్ డొనేట్ చేయడం జరిగింది. గతంలో ఆరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లకు ఇదే విధంగా అందించడం జరిగింది. మొత్తం గా మండలంలోని 27 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు రోటరీ క్లబ్ భాగ్యనగర్ వారు డొనేట్ చేయడం జరిగింది. కేశంపేట మండల ఎంఇవో మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేశంపేట జడ్పిటీసీ తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోటరీ క్లబ్ భాగ్యనగర్ వారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ ప్రెసిడెంట్ మధులేటి సెక్రటరీ ఆదినారాయణ ట్రెజరర్ జిస్ రెడ్డి బండబాల్‌రెడ్డి హరికొల్లా రెడ్డి శ్యామ్‌రెడ్డి సతీష్‌రెడ్డి మహీధర్ రెడ్డి రమణ సభ్యులు కేశంపేట మండల ఎంఈవో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖకు తక్షణమే మంత్రిని నియమించాలి

### జిల్లా యువమోర్చా అధికార ప్రతినిధి కూతురు మహేందర్

**షాబాద్, జూన్ 19, ప్రభాతవార్త :** విద్యాశాఖకు తక్షణమే మంత్రిని నియమించాలని బీజేవైఎం రంగారెడ్డి జిల్లా యువమోర్చా అధికార ప్రతినిధి కూతురు మహేందర్ డిమాండ్ చేశారు. బుధవారం షాబాద్ లో ఆయన మాట్లాడుతూ....విద్యాసంస్థలు ప్రారంభమైనప్పటికి విద్యా శాఖకు మంత్రిని నియమించకపోవడం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన చేతగానితనం అని ఎద్దేవా చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖకు మంత్రిని నియమించాలన్నారు. ఎన్ని కల్లో కల్లబొల్లి కబుర్లు, మోసపూరితమైన వాగ్దానాలతో గద్దెనెక్కిన కాం గ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్న విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిం చారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేయాల్సి న ఆ శాఖకు మంత్రి లేకపో వడం వల్ల సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నా రని వెల్లడించారు. రానున్న రోజుల్లో అన్ని పరీక్షలు నిర్వహించడంతో పాటు పలు రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలను పటిష్టంగా నిర్వ హించా ల్సి ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా విద్యాశాఖకు తక్షణమే మంత్రి నియమించి ఆ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం

### -యువజన కాంగ్రెస్ రాష్ట్రప్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు

**కొడంగల్, జూన్ 19ప్రభాతవార్త** ప్రాణాపాయ స్దితిలో ఉన్న వారికి రక్తదానం చేయడంతో ప్రాణదాతలుగా నిలుస్తారని, అన్ని దానాల్లో కన్న రక్తదానం మిన్న అని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కృష్ణంరాజు అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్బంగా బుధవారం హైద్రాబాద్‌లోని గాంధీభవన్‌లో రక్తదాన కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రక్తం దానం చేయడంతో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు రక్తం దానం చేయా లని అన్నారు. కార్యక్రమంలో యుజవన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి, యువజనకాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశం తదితరులు పాల్గొని రక్తం దానం చేశారు.



# ప్రజా సమస్యలు పరిష్కరించాలి

### ఎంపిపి లలిత రమేష్

**మర్పల్లి ,జూన్ 19 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి ప్రజా సమ స్యలున్న అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ లలిత రమేష్ అన్నారు. బుధవారం నాడు మండల పరిషత్ కార్యా లయంలో ఎంపీపీ బట్టి లలిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వ హిం చారు. గ్రామాలలో ప్రజాప్రతినిధులు లేనందున అధికారులే గ్రామ కార్యద ర్శులు సమస్యలను పరిష్కరించాలని వారన్నారు. వర్షాకాలం వస్తున్నందున గ్రామాల్లో ప్రమాదకారంగా ఉన్న ఇనుప స్థాంబాలను వైర్లు తొలగించాలని జడ్పిటిసి మధుకర్ విధ్యుత్ అధికారులకు తెలిపారు. మిషన్ భగీరథ వెంటనే పూర్తి చెయాలని ఆయన కోరారు. మర్పల్లి మండల కేంద్రంలో 30 సంవత్సరాల నుంచి చీరు వ్యాపారులు డబ్బాలను వేసుకోని జీవనం సాగిస్తున్నా చిరు వ్యాపారులను ఆర్టీసీ అధికారులు వారి డబ్బాలను తొలగించి వారి బ్రతుకులపై కొట్టారని బస్టాండ్ స్థలంలో లేని డబ్బాలు కూడా తొలగించి వారి బతుకులు పై కొట్టారని బస్టాండ్ లో ఉన్న ఖాళీ



సమావేశం మాట్లాడుతూన్న ఎంపీపీ లలిత రమేశ్

స్థలంలో డబ్బాలు తొలగించిన వారికి స్థలాలు ఇవ్వాలని లేదంటే ఉద్యమిస్తామని వారన్నారు. అధికారులతో సమైక్యంగా ఉండి సమస్యలు పరిష్కరం కోసం గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడ్డామని సుమారు 6 కోట్లతో గ్రామాలలో అభివృద్ధి పనులు చేశామని జడ్పిటిసి మధుకర్, ఎంపిపి లలిత రమేష్ తెలిపారు. ఈ సమావేశంలో చివరిది కావడంతో ఐదు సంవత్సరాలు పాటు సహకరించిన అధికారులందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడివో రాజ మల్లయ్య తహాశిల్దార్ గణేష్ ఉపాధ్యక్షులు మోహాన్‌రెడ్డి, సోయల్ పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మెకానికల్ ఇంజనీరింగ్‌లో ర్యాంకు సాధించిన సతీష్‌ను అభినందిస్తున్న దృశ్యం

## నిరుపేద విద్యార్థికి మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉత్తమ ర్యాంకు

**బొంరాస్‌పేట్, జూన్19, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం మంగళవారం ప్రక టించిన పిజీఈసీఈటీ-2024 ఫలితాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో దుద్యాల్ మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన వడ్ల సతీష్ తండ్రి వెంకటయ్య అనే నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించడం జరిగింది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమర్యాంకు సాధించిన విద్యార్థికి గ్రామస్తులు పూలదండ శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కష్టపడి చదవడం వలన ఉత్తమ ఫలితాలు వస్తాయని, ఉత్తమర్యాంకు సాధించినందుకు పలువురు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. సతీష్ కష్టపడి చదివి ఇలాంటి ఉత్తమ ఫలితాలను సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రవినాయక్, గ్రామ స్తులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలపై అధికారులు కొరడా

### -వైష్టవి ఏజన్సీస్ యజమానికి నోటీసులు

### -రూ.28లక్షల అనుమతి లేని ఎరువుల సీజ్

### -అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు తప్పవు-ఏఓ లావణ్య



వైష్టవి ఏజన్సీస్ దుకాణం యజమానికి నోటీసు అందిస్తున్న ఏఓ

**కొడంగల్, జూన్ 19ప్రభాతవార్త** కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ఎరువులు, విత్తనాల దుకాణాలపై గత వారం రోజులుగా వ్యవసాయశాఖ అధికారులు అకస్మిక తనిఖీలు చేస్తు కొరడా ఝులిపిస్తున్నారు. మంగళవారం పట్టణంలోని ఓంట్రేడింగ్ ఎరువుల దుకాణంలో అనుమతి లేని ఎరువులను సీజ్ చేసిన అధికారిణి లావణ్య బుధవారం వైష్టవి ఏజన్సీస్ ఎరువుల దుకాణంలో ఎరువులను పరిశీలించగా వ్యవసాయా శాఖ అనుమతులు లేని డీఏపీ 68 మెట్రిక్ టన్నులు, యూరియా 88 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 13 టన్నులు నిల్వ ఉన్నాయి. దుకాణంలో అమ్మకానికి నిల్వ ఉన్న ఎరువులకు సంభందించి వ్యవసాయశాఖ నుంచి అనుమతులు వచ్చేంత వరకు వాటిని విక్రయించరాదని ఏఓ తెలిపారు. మంగళవారం ఓంట్రేడింగ్ ఎరువుల దుకాణంలో స్టాక్‌ను సీజ్ చేయగా బుధవారం వైష్టవి ఏజన్సీస్ ఎరువుల దుకాణంలో ఎరువులు నిల్వ లభించడం విశేషం. గతంలో సైతం వైష్టవి ఎరువుల దుకాణంలో అనుమతులు లేని మందులు విక్రయించిన ఘటనలో కేసు నమోదు కాగా రెండవ సారి అనుమతి లేని ఎరువులు విక్రయించారని అన్నారు. ప్రస్తుతం వ్యవసాయశాఖ అనుమతి లేని స్టాక్‌ను సీజ్ చేయడంతో పాటు దుకాణం యజమానికి ఏఓ నోటీసులు అందించారు. సీజ్ చేసిన ఎరువుల విలువ సుమారు రూ.28లక్షలకు పైబడే ఉంటుందని ఏఓ అంచనా వేశారు. 21 రోజుల పాటు ఎరువులకు సంభందించిన అనుమతులు తీసుకోకపోతే ఎరువుల దుకాణం సీజ్ చేయడం జరుగుతుందని ఏఓ హెచ్చరించారు.

## విద్యాభివృద్ధికి మా వంతు సహాయం

### -ఆర్‌బిఓఎల్ మేనేజింగ్ డైరెక్టర్ బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డి

**తాండూరు టౌన్ జూన్19,ప్రభాతవార్త :** విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందజేస్తామని ఆర్‌బిఓఎల్ మేనేజింగ్ డైరెక్టర్ బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మల్లికార్జున అప్పాజీ పుట్టిన రోజు సందర్భంగా తాండూ రు మండలం కరణ్ కోట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. అప్పాజీ సేవ సమితి ప్రతినిధులు ప్రభాకర్ రెడ్డి, దర్మిది రవి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హెడ్ మాస్టర్ నర్సి రెడ్డి అధ్యక్షత వహించారు. సరళ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ....విద్యార్థులు చదువులతో పాటు శారీరక మానసిక దారుఢ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. కరణ్‌కోట్ స్కూల్ టీచర్లు అంకిత భావంతో పని చేస్తున్నారని కొనియాడారు. ముున్ముందు విద్యార్థులకు చేపట్టబోయే కార్యక్రమాలపై తమ సంస్థ యాజమాన్య ప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆమె చెప్పారు. ఈ కార్యక్ర మంలో ఎంపిటిసి రాజ్ కుమార్, మాజీ ఎంపిపి శరణు బసప్ప, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ భవాని, మాజీ సర్పంచ్ శివ కుమార్, జర్నప్ప, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటుబుక్స్, బ్యాగులు అందజేత

**కొడంగల్, జూన్ 19ప్రభాతవార్త** అనేక సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్న యువ 24 ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరపడే నోటుబుక్కులు, బ్యాగులు అందజేశారు. బుధవారం మండల పరిధిలోని ఆశమ్మకుంట తండా పాఠశాలలో పాఠశాల ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో యువ 24 ఫౌండేషన్ ప్రతినిధులు సురేష్‌గౌడ్, కలారి రమేష్, న్యాయ వాది సాయి, కుర్వ రమేష్ విద్యార్థులకు నోటుబుక్స్, ప్లేట్స్, పెన్సిల్‌లు, పెన్నులు, బ్యాగులు, వాటర్ బాటిల్స్, ఫ్లోర్ నైట్ తదితర వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కృష్ణయాదవ్, రామయ్యగౌడ్, సర్పంచ్ వెంకటేష్, నాగేష్ దేవ్ మహరాజ్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.



## ఈ నెల 21న మేడ్చల్ కలెక్టరేట్‌లోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో జాబ్ మేళా

### మేడ్చల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.వై.నిర్మల

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19, ప్రభాతవార్త**

ఈ నెల 21వ తేదీన మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జాబ్ మేళా జరుగుతుందని మేడ్చల్ జిల్లా ఉపాధి, కల్పన అధికారి ఎం.వై.నిర్మల తెలిపారు. జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 21న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. రిలయన్స్ జియో హైదరాబాద్ వారు జియో ఫైబర్ ఇంజనీర్, జియో ఫైబర్ అసోసియేట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించటం జరుగుతుందన్నారు. వీటికి విద్యార్హతలు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా ఏదైనా డిగ్రీ ఉన్న వారు అర్హులని అన్నారు. జియో ఫైబర్ ఇంజనీర్‌కు 15వేలు, అసోసియేట్‌కు 14వేలు పోస్టులకు వేతనాలు ఉంటాయని అన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యు వకులు డబ్లుడబ్లుడబ్ల్యు.ఎన్ఐసి.జిఒవి.ఇన్ పోర్టల్‌లో రిజిష్టర్ చేసుకుని హాజరు కావాలని, హెచ్ఆర్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారని మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 7386809422కు సంప్రదించాలని ఆమె సూచించారు.

## రద్దీ సమయంలో సంయమనం పాటించాలి

### -ప్రమాదాల నివారణకు స్పెషల్‌డ్రైవ్: డిఎం



ఆర్టీసీ కండక్టర్‌కు సూచనలు చేస్తున్న డిఎం కవిత

**ఘట్‌కేసర్, జూన్ 19, ప్రభాతవార్త:** రద్దీ సమయాల్లో డ్రైవర్లు సంయమనం పాటించి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేయాలని చెంగిచర్ల డిపోమేనేజర్ కె.కవిత అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ యంనంపేట్ చౌరస్తా వద్ద బుధవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రయాణికులు, సంస్థ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. పాఠశాలలు, కళాశాలలు తిరిగి ప్రారంభం కావడంతో బస్సుల రద్దీ పెరిగిందని దీంతో విద్యార్థిని, విద్యార్థులు, మహిళా ప్రయాణికులు బస్సులు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు భద్రత నియమాలను పాటించాలన్నారు. కదులుతున్న బసు ్సను ఎక్కొద్దని, ఫుట్‌బోర్డు ప్రయాణంలో ఎవరు లేరని నిర్ధారించకున్న తర్వాతనే బస్సును కదిలించాలని సూచించారు. బస్సు పూర్తిగా ఆపిన తర్వాతనే ప్రయాణికులు దిగేవిధంగా చూడాలని, ప్రయాణికులు సురక్షితమైన ప్రయాణాన్ని నిర్దారించడం వరకు అన్ని పాయింట్లలలో స్పెషల్ డ్రైవ్ జరుగుతుందని డ్రైవర్, కండక్టర్ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. మియాపూర్ డిపో మేనేజర్ వెంకటేశం, ఎస్‌డీఐ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎదులాబాద్‌లో యువకుడు అదృశ్యం

**ఘట్‌కేసర్, జూన్ 19, ప్రభాతవార్త:** ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు తిరిగి రాకుండా పోయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామానికి చెందిన బత్తిని నర్సింహ్మగౌడ్ కుమారుడు శ్రీకాంత్ (28) ఈనెల 15వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో వాళ్లకు ఘట్‌కేసర్ సబ్‌రిస్ట్రార్ కార్యాలయం పక్కన ఉన్న తన ఆఫీస్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. శ్రీకాంత్ కోసం కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకి లభించకపోవడంతో అతని తల్లి లలిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శ్రీకాంత్ మేరున్ కలర్ చొక్కా బ్లాక్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని ఎవరికైనా సమాచారం తెలిస్తే ఘట్‌కేసర్ పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ శేఖర్ తెలిపారు.

## రాబోయే రోజులలో కాబోయే ప్రధాని రాహుల్‌గాంధీ

### టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి,రియాజ్



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

**పెద్దేముల్, జూన్ 19, ప్రభాతవార్త:** రాబోయే రోజులలో కాబోయే ప్రదాని రాహుల్‌గాంధీ అని టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్ అన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరిం చుకొని బుధవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకుపండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యండి. రియాజ్ మాట్లాడుతూ ఎప్పటికైన రాహుల్‌గాంధీ ప్రదాని కావాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ యంపిటిసి డాక్టర్ రమేష్, ఏ బ్లాక్ కాంగ్రెస్‌పార్టీ ప్రదానకార్యదర్శి సయ్యద్ మీనాజ్, తట్టెపల్లి గ్రామకమిటి అధ్యక్షుడుకే.నర్సిములు, హన్మాపూర్ రాజు, సయ్యద్ శబ్బీర్, సాయిబాబా, కోళ్ల పెంటప్ప తదితరులు పాల్గొన్నారు.

## బొక్కోనిగూడలో ఆటో మాయం

**ఘట్‌కేసర్, జూన్ 19, ప్రభాతవార్త:** ఇంటి ముందు పార్క్ చేసిన ఆటో కనిపించకుండా పోయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ బొక్కోనిగూడకు చెందిన బచ్చు మహేశ్‌కుమార్ తన ప్యాసింజర్ ఆటోను ఈనెల 18న సాయంత్రం 3 గంటలకు తన ఆటో (టిఎస్10యుఏ-0792)ను ఇంటి ముందు పార్కు చేసి ఇంట్లోకి వెళ్లాడు. బుధవారం ఉదయం 5 గంటలకు సమయంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చి చూడగా తన ప్యాసింజర్ ఆటో కనిపిం చలేదు. దీంతో పరిసరాల్లో అంతాటా వెతికినా ఆటో ఆచూకి లభించ కపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను అపహరిం చుకుపోయారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ రాముునాయక్ తెలిపారు.



## ఘనంగా శ్రీఆజనేయ స్వామి నవదేవాలయం వార్షికోత్సం

**తలకొండపల్లి, జూన్ 19, ప్రభాతవార్త** తలకొండపల్లి మండలం శ్రీఆంజనేయ స్వామి నవదేవాలయం వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా స్వామి వారి కుం కుమ అర్చన మనుమాన్ చాలీసా హోమం, వెంకటేశ్వర స్వామి కల్యాణం ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్‌యాదవ్ హాజరైన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు యాదగి రి నర్సింహయ్య శాస్త్రి ఆలయ కమిటీ అధ్యక్షుడు కూన శ్రీను పిఎసిఎస్ వైస్‌చై ర్మన్ కూన రవి ఎంపిటిసి అంబాజీ నరేందర్ గౌడ్ గోపాల కృష్ణ విష్ణువర్ధన్ యాదవ్ విజయ్‌కుమార్ సంతోష్ రాజు గుప్తా రాజేందర్‌రెడ్డి సుధాకర్ ఖేఖర్ రెడ్డి విజయ్ యాదవ్ శ్రీను మణికంఠ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు ఎంపీడీఓ మాధురి



ఎంపీడీఓగా నియమితులైన మాధురి కుసుమను సన్మానిస్తున్న దృశ్యం

**ఆమనగల్లు, జూన్19, ప్రభాతవార్త:** ఆమనగల్లు ఎంపీడీఓగా కుసుమా మాధురి బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఫారూక్ హుస్సేన్ పదవి విరమణ చేయడంతో తలకొండపల్లి మండల ఎంపీడీఓ శ్రీకాంత్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రభుత్వం పూర్తి స్థాయి ఎంపీడీ ఓను నియమిస్తూ ఎస్ఈఆర్‌పీ హైదరాబాద్ ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తున్న కుసుమ మాధురిని ఆమనగల్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బదిలీ చేసింది. పదవి బాధ్యతలు స్వీకరించేందుకు విచ్చేసిన నూతన ఎంపీడీఓను కార్యా లయ సిబ్బంది స్వాగతం పలికి శాలువాతో సత్కరించింది. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, అధికారులు శ్రీలత, ఏఈ కృష్ణయ్య, సీనియర్ అసిస్టెంట్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ప్రసన్నలత, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**తలకొండపల్లి, జూన్19, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని వెంకట్రావు పేట గ్రామంలో ఆవులుదాస్‌రాములు గౌడ్ బుధవారం మరణించడం జరిగింది. ఈ విషయం గ్రామ గౌడ సంఘం సభ్యుల ద్వారా తెలుసుకున్న తాలుకా మండల గౌడ సంఘం నాయకులు వచ్చి వారి కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయలు హార్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షులు బత్తుల బాల కుమార్ గౌడ్ తిరుణి విష్ణుగౌడ్ గంగా నరసింహాగౌడ్ ముకురాల అశోక్‌గౌడ్ ఆయిలి తిరుపతి గౌడ్ వెంకట్‌గౌడ్ కొండల్‌గౌడ్ జంగయ్య గౌడ్ మాచెందర్ గౌడ్ రాఘవేందర్‌గౌడ్ మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో

**బంట్వారం, జూన్ 19 (ప్రభాత వార్త):** ఈనెల 23న వికారాబాద్ లో నిర్వహించే మెగా జాబ్ మేళాన ు నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాములు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నిరుద్యోగులు పదవ తరగతి పైబడి పీజీ స్థాయి వరకు చదివిన నిరుద్యో గులుగా ఉన్నవారు ఈ మెగా జాబ్ మేళాకు హాజరు కావాలని ఆయన చెప్పారు. ఇందులో వివిధ కంపెనీలకు చెందిన ఉద్యోగాల ు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. యువతీ యువకులు తమ బయోడేటా ఒరిజినల్ సర్టిఫికెట్లతో 23న వికారాబాద్ గౌలికర్ ఫంక్షన్ హాల్ లో హాజరు కావాలని తెలియజేశారు. ఇందులో ఎంపికైన వారికి ఆయా రంగాలలో ఆసక్తి మేరకు ఉద్యోగాలు కల్పిస్తారని పేర్కొన్నారు.

## గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసిన అంజయ్య



హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర సభాపతి వికారాబాద్ శాసన సభ్యులు గడ్డం ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య

**కోట్‌పల్లి, జూన్ 19, ప్రభాతవార్త;** హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర సభాపతి వికారాబాద్ శాసన సభ్యులు గడ్డం ప్రసాద్‌కుమార్, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని వారి నివాసంలో బుధవారం నాడు నూతనంగా ఎన్నికైన కోట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య మర్యాద పూర్వకంగా కలిసి పూస్పగుచ్ఛం అందజేశారు. అయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, డైరెక్టర్లు అక్బార్, ఎగ్బాల్, సుదర్శన్‌రెడ్డి, కోట్‌పల్లి కాంగ్రె స్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్‌నాయక్, జిన్నారం మాజీ సర్పంచు మల్లేశం, మాజీ ఉప సర్పంచు రియాజోద్దీన్, నాయకులు నక్కల బందయ్య, రమేష్ నాయక్, ఉప్పరి రమేష్, చిత్రశేఖర్ పటేల్, విఠల్‌గౌడ్, కానుకరెడ్డి, తదితరులు నాయకులు పాల్గొన్నారు,

## నేడు విద్యుత్ అంతరాయం

**యాచారం జూన్19,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని మేడిపల్లి మల్కిజ్ గూడ ,యాచారం గ్రామాలలో గురువారం (నేడు) విద్యుత్ సమస్యల పరి ష్కారం కోసం అంతరాయం ఉంటుందని ఏఈ సందీప్ కుమార్ పేర్కొ న్నారు. చరణ్ లెవెన్ కెవి ఫీడర్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ,మేడిపల్లిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ,మల్కిస్ గూడలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

## ఉపాధి హామీ కూలీల డబ్బులు చెల్లించాలి



ఎంపిడివో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**యాచారం జూన్19,ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం గత రెండు నెలల సంబం ధించి ఉపాధి హామీ కూలీల డబ్బులను వెంటనే విడుదల చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న తీరు వ్యతిరేకంగా ఎంపిడివో కార్యాలయం ముందు నిరసన నిర్వహించారు. అనంతరం ఎంపిడిఓ నరేందర్ రెడ్డి, ఎపిఓ లింగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఇందిరమ్మ, జంగయ్య, సాయులు, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అశోక్‌కుమార్‌గౌడ్‌కు మేడ్చల్ నాయకుల సన్మానం

**ఘట్‌కేసర్, జూన్ 19, ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం ఘట్‌కేసర్ మండల టిడిపి నాయకులు కలిశారు. ఈమేరకు మేడ్చల్ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ సుంకరి వెంకటేశ్ ఆధ్వర్యంలో అశోక్‌కుమార్‌గౌడ్‌ను పలు మండలాల నాయకులు మర్యా ద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఘట్‌కేసర్ మండల పార్టీ అధ్య క్షులు వేముల సంజీవగౌడ్, నాగారం మున్సిపల్ అధ్యక్షులు కొండ జంగారెడ్డి, దమ్మా యిగూడ మున్సిపల్ అధ్యక్షులు కృష్ణారావు, పోచారం మున్సిపల్ నాయ కులు సామల జగన్మోహన్‌రెడ్డి, ఘట్‌కేసర్ నాయకులు టి.మహేశ్, సురేం దర్‌రెడ్డి, ఉమాశంకర్, బ్రహ్మం, రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ బాలకృష్ణారెడ్డి

## తాండూరులో బైక్ దొంగల అరెస్టు

### రిమాండ్‌కు తరలించిన పోలీసులు

### వివరాలు వెల్లడించిన డిఎస్పీ బాలకృష్ణారెడ్డి

**తాండూరు, జూన్ 19, ప్రభాతవార్త :** జల్సాలకు అలవాటు పడి బైక్‌లను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్న దొంగలను తాండూరు పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి ఆరు బైక్‌లను స్వాదీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు బుధవారం తాండూరు డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ బాలకృష్ణారెడ్డి వివరాలను మీడియాకు వెల్లడించారు. జూన్ 17న తాండూరు పట్టణంలోని ఇందిరాచౌక్‌లో మినార్ టీ పాయింట్ ఎదురుగా పార్క్ చేసిన హీరో హోండా బైక్ చోరీకి గురికావడంతో బైక్ యజమాని బోయిన సత్యనారాయణ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 9గంటల ప్రాంతంలో తాండూరు పట్టణ పోలీసులు విలియమూన్ చౌరస్తా సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా తాండూరు పట్టణం గ్రీన్ సిటీ కాలనీకి చెందిన అడిగోళ్ల వంశీకృష్ణగౌడ్, అంతారం గ్రామానికి చెందిన బొడ్డె జస్వంత్ బైక్‌పై వెళ్తుండగా పోలీసులు బైక్‌ను ఆపి వాహన పత్రాలపై ఆరా తీయగా బైక్ చోరీ చేసినట్లు బయటపడింది. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని మరింత విచారించగా తాండూరు పట్టణంతో పాటు వివిధ ప్రాంతాలలో బైక్‌లను దొంగతనం చేసినట్లు అంగీకరించారు. తాండూరు ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు మైనర్‌లతో కలిసి ఆరు బైక్‌లను దొంగతనం చేసినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు డిఎస్పీ వివరించారు. ఈ మేరకు నిందితులను ఆదుపులోకి తీసుకొని బైక్‌లను స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రీన్ సిటీ కాలనీకి చెందిన అడిగోళ్ల వంశీకృష్ణగౌడ్, అంతారం గ్రామానికి చెందిన బొడ్డె జస్వంత్‌లను కోర్టులో హాజరుపర్చనున్నట్లు వెల్లడించారు. మరోవైపు కేసు చేదింపులో చాకచక్యంగా వ్యవహారించిన ఎస్సై కాశీనాథ్, రాములుతో పాటు సిబ్బంది రామకృష్ణ, అంజద్, శివకుమార్, సాయప్ప, షబీల్‌లను డిఎస్పీ అభినందించారు.

## తాండూరు మున్సిపాల్టీకి భారీ ఆదాయం

### వ్యర్థాల సేకరణ వేలంకు మంచి స్పందన

### బహిరంగ వేలంలో రాష్ట్ర స్థాయి రికార్డు

### రూ. 30.65లక్షలకు దక్కించుకున్న కోడంగల్ వాసి



వేలం పాటలో పాల్గొన్న వ్యాపారులు

**తాండూరు, జూన్ 19, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపాల్టీకి గతంలో ఎన్నడు లేని విధంగా భారీ ఆదాయం సమకూరింది. వ్యర్థాల సేకరణ వేలంకు మంచి స్పందన లభించింది. పట్టణంలో చికెన్, మటన్, చేప మాంసాల వ్యర్థాల సేకరణకు నిర్వహించిన బహిరంగ వేలంలో రాష్ట్ర స్థాయిలోనే రికార్డు ఆదాయాన్ని దక్కించుకుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విదంగా బహిరంగ వేలంలో రూ. 30లక్షల 65వేల ఆదాయం లభించింది. బుధవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చికెన్, మటన్, చేప మాంసాల వ్యర్థాల సేకరణకు మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి ఆద్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో తాండూరు పట్టణంతో పాటు కోడంగల్, పరిగి, గద్వాల ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో కోడంగల్‌కు చెందిన రఫీ అనే వ్యక్తి అత్యధికంగా రూ. 30లక్షల65వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. బహిరంగ వేలంలో మున్సిపల్‌కు ఇంత భారీ ఆదాయం రావడం రికార్డు అని కమిషనర్ విక్రంసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### దైవచింతన అలవార్చుకోవాలి : ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి.



రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

**షాద్‌నగర్, జూన్ 19, (ప్రభాతవార్త) :** నేటి సమాజంలో ప్రతి ఒక్కరు దైవ చింతన అలవార్చుకోవాలని, అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుం దని, మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల కేంద్రంలోని 14వ వార్డులో ఉన్న రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిని, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, స్థానిక కౌన్సిలర్, కాలనీ వాసులు, మహిళలు, పెద్దలు, యువకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

### రోగులకు ప్రజాప్రతినిధులు, నేతలు పండ్లు పంపిణీ

**ఘట్‌కేసర్, జూన్ 19, ప్రభాతవార్త:** పేదప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్దంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రిలో బుధవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని పలు వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. నిరుపేదలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కార్యకర్తలు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సూపర్‌రింటెండెంట్ వి.కోట్యానాయక్, కౌన్సిలర్లు కడుపొల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, మాజీ సర్పంచ్ మెడబోయిన వెంకటేశ్, మాజీ ఎంపిటిసి సగ్గు అనిత శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ కొంతం బాల్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, మీసాల సుధాకర్‌రావు, డీసీసీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మున్సిపల్ ఉపాధ్యక్షులు కోరుబోతు నాగరాజు, ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మెరుగు నరేశ్‌గౌడ్, నాయకులు బొక్క సత్తిరెడ్డి, గాజుల వీరేందర్‌యాదవ్, ఎం.శ్రీనివాస్, నర్సింగ్‌రావు, రాజారత్నం, మేకల సునీల్‌కుమార్, సుధాకర్, బాబురావు, జగదీష్, ఫయిమ్ తదిరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, జూన్ 19 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహింపట్నం, షాద్‌నగర్, రాజేంద్రనగర్, చేవెళ్లతో పాటు పట్టణ ప్రాంతాలు, మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధుల ఆధ్యర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఈ సారి ఘనంగా పార్టీ నేతలు, కార్యకర్తల హర్షధ్వనాల మధ్యన నిర్వహించారు. జన్మదిన వేడుకల సందర్భంగా భారీగా కేకులు కట్‌చేసి ఒకరికొకరు స్వీట్లు పంపిణీ చేశారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్యర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు తీగల కృష్ణారెడ్డితో పాటు స్థానికంగా పలువురు సీనియర్ నేతలు పాల్గొని దేశంలో రాహుల్ గాంధీ బడుగు బలహీన అభివృద్ధికి అహర్నిషలు చేస్తున్న కృషిని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ఒకటెండు రాష్ట్రాలు తప్ప అన్ని రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణలభిస్తోందని పార్టీ నేతలు కొనియాడారు.

**మహేశ్వరంలో..**

మహేశ్వరం పట్టణ కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణుల మధ్యన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామశాఖ అధ్యక్షులు బంగరుగల్ల లాజర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తావద్ద 50కేజీల కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మహేశ్వరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి కె.రఘుమారెడ్డి, ఎంపిపి సునితా ఆంధ్యానా యక్, పార్టీ సీనియర్ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖాకీశ్వర్ ముదిరాజ్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, వి.మల్లేష్‌యాదవ్, కుమార్, కె.రాములు ముదిరాజ్, ఎ.గోపాల్ నాయక్, సుభాష్, ఎస్.చంద్రయ్య, పి.దేవయ్య, రాజు, శ్రీనివాస్, పాండునాయక్, కృష్ణానాయక్, అల్లె భిక్షపతి, గుర్రం భిక్షపతి, ఏపూరి రాజు, ఏపూరి నర్సింహా, ఐ.నర్సింహగౌడ్, పరమేష్, శంకర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

**కడ్తాల్‌లో..**

**కడ్తాల్, జూన్ 19 ప్రభాతవార్త :** భావి భారతదేశ ప్రధానమంత్రి, భారతదేశ ప్రజల తరపున ప్రశ్నించే గొంతుక ఏఐసిసి నేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కేంద్రంలో కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మాట్లాడుతూ దేశ ప్రజలను ఏకం చేయడం కోసం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడోయాత్ర చేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి రాహుల్‌గాంధీ అని కొనియాడారు. దేశ ప్రజల సమస్యలే ధ్యేయంగా అనుక్షణం పోరాడుతున్నారని అన్నారు. రాహుల్‌గాంధీ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన కుటుంబం నుంచి వచ్చారని, రాహుల్‌గాంధీ మన దేశానికి రాబోయే రోజులలో ప్రధానమంత్రి కావాలని కోరారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితే ఈ దేశంలో పేదరిక నిర్మూలన అవుతుందని, భారతదేశం అత్యున్నతమైన స్థానంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దేశంలో అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వ్యవసాయ రంగం ఒక దండగ కాదు పండగ అని, మన రైతు డిక్లరేషన్ పథకాలను తీసుకొచ్చారని, వాణిజ్యం, వ్యాపారంలో మనదేశం ముందుండాలని రాహుల్‌గాంధీ ఆకాంక్ష అన్నారు. రాబోయే రోజులలో రాహుల్‌గాంధి ఒక దీర్ఘకాలిక ఆలోచన చేసే వ్యక్తి మనకు కావాల్సిన వాటిని సమకూర్చి దూరదృష్టి ఉన్న వ్యక్తి అన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని యువతీ, యువకులు దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి అయితేనే దేశం మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆ విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి ఆశయసాధనను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, కో ఆప్షన్ సభ్యులు జాంగీర్‌బాబా, సేవాదళ్ లక్ష్మయ్య, భాస్కర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, సత్యంయాదవ్, హన్మనాయక్, రామకృష్ణ, బుచ్చయ్య, పర్వతాలు, జవహర్, యాదయ్య, శ్రీను, క్యామ రాజేష్, శేఖర్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు హీరాసింగ్, శాబుద్దీన్ టౌన్ అధ్యక్షుడు భానుకిరణ్, ఇమ్రాన్‌బాబా, రామకృష్ణ, తులసిరామ్, భారత్ యాదవ్, రమేష్, రాజునాయక్, రాజు, మహేష్, నరేష్, శ్రీశైలం, లక్ష్మణ్, రవి, కిరణ్ పాల్గొన్నారు.

**షాద్‌నగర్‌లో..**

**షాద్‌నగర్, జూన్ 19, (ప్రభాతవార్త) :** ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టి భారతదేశాన్ని ఏకం చేసిన వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆయన కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరి తరుపున రాహుల్‌గాంధీకి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా రాహుల్ గాంధీ వెనుక బడిన వారికి అండగా ఉండాలనేది ఆయన తత్వమని, దేశ భవిష్యత్తు కోసం భారతదేశ ఆకాంక్షలను నెరవేర్చే ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బాబర్‌ఖాన్, సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు పురుషోత్తంరెడ్డి, షకీబ్, ఖదీర్, రాజేష్‌గౌడ్, రాయికల్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ లింగం, మురళీమోహన్, శ్రీహరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్‌లో..**

**మేడ్చల్, జూన్ 19, ప్రభాతవార్త :** రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు దేవ, కౌడె మహేష్, నాయకులు మల్లేష్ గౌడ్, శ్రవణ్, రవి ముదిరాజ్, రాహుల్ యాదవ్, నాగభూషణం, వెంకటేష్, శివ కుమార్, లక్ష్మణ్ ముదిరాజ్, సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు.



మేడ్చల్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

# నులి పురుగుల రహిత మండలంగా తీర్చిదిద్దుతాం

### కుల్కచర్ల వైద్యాధికారిణి డాక్టర్ మాధురి, సిహెచ్‌ఒ చంద్రప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు



హాజరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది

**కుల్కచర్ల, జూన్19, ప్రభాతవార్త;** కుల్కచర్ల మండలాన్ని నులి పురుగుల రహిత మండలంగా మారుస్తామని మండల వైద్యాదికారిణి డాక్టర్ మాధురి కమ్యూ నిటి హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులి పురుగుల నివారణపై ఆశాలు, అంగన్‌వాడి టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నులి పురుగుల నివారణాన్ని ఈ నెల 20, 27 తేదీలలో రెండు విడుతలుగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 1సంవత్సరం పిల్లల నుండి 19 సంవత్సరాల పిల్లల వరకూ ఆల్బెండజోల్ మాత్ర వేస్తామని తెలిపారు. ఉమ్మడి కుల్కచర్ల మండలంలోని అంగన్‌వాడి స్కూల్లు, ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు ఉన్నత పాఠశాలలు, కాలేజీలో మాత్రలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి సిబ్బందికి ఎఎన్‌ఎమ్‌లకు హెల్త్ అసిస్టెంట్లకు ఆశాలకు ఒకరోజు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి మండలాల్లో మొత్తం 1 నుండి 19 సంవత్సరాల పిల్లలు 16857 మంది ఉన్నారని అందులో మగ పిల్లలు 8901 మంది ఆడ పిల్లలు 7956 మంది ఉన్నట్లు తెలిపారు. వీరితో పాటు వీధులలో ఉండే బాలబాలికలు 19 సంవత్సరాలు ఉండి పనులకు వెళ్లే కార్మికులకు కూడా మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు. 1 నుండి 2సంవత్సరాల లోపు పిల్లలకు సగం మాత్ర మిగతా పిల్లలకు ఒక మాత్ర వేస్తామని అన్నారు. ఈ మాత్రలు మద్యాహ్నం భోజనం చేసిన తర్వాత అరగంటలకు వేయాలని తెలుపుతూ రికార్డుల్లో పొందు పర్చాలని ఈ రోజు వేయని వారిని గుర్తించి 27న వేయాలని తెలిపారు. మాత్రలు వేసుకున్న తర్వాత ఎవరికైనా వాంతికి రావడం, కళ్లు తిరగడం, కడుపునొప్పి రావడం జరిగితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నేరుగా కాని లేదా సమాచారం అందించాలని తెలిపారు. ఈ మాత్రల వల్ల విద్యార్థులకు చదువు పట్ల మక్కువతో పాటు ఏకాగ్రత కలుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ఎస్ రత్నలత, స్వరూపారాణి, సూప ర్‌వైజర్స్ యాదమ్మ, విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ వెంకటయ్య, అంజూ, ఎన్ఎమ్‌లు రత్నమ్మ, వెంకటమ్మ, సుజాత, జంగమ్మ, మంగమ్మ, భారతమ్మ, జ్యోతి, బి.సుజాత, గౌరి, శ్రీలత, చంద్రకళ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

## సికెల్‌సెల్ అనీమియా అవగాహన సదస్సు

**కడ్తాల్, జూన్ 19 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సికెల్‌సెల్ అనీమయా కార్యక్రమం కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో అధ్యక్షులు రామేశ్వరిదేవి, డిటిడిఓ రంగారెడ్డి డిస్ట్రిక్ట్, వెంకటయ్య, ఎటిడిఓ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాధికి సంబంధించిన లక్షణాలు, జన్యుపరంగా వచ్చే అనేక రోగాలకు దారి తీస్తుందని అదే విధంగా రక్తంలోని హిమోగ్లోబిన్ శాతాన్ని తగ్గిస్తుందని ఈ రోగాన్ని కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సికిల్‌సెల్ అనీమియా నుండి విముక్తి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కట్టుగా పని చేయాలని అదేవిధంగా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి సమతుల్యమైన ఆహారాన్ని తీసుకుని వ్యాయామాలు చేసి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని, విద్యార్థినీ, విద్యార్థులు, యువతీ యువకులు మద్యపానానికి, ధూమపానానికి దూరంగా ఉండాలని చెడు అలవాట్లకు బానిస కాకూడదని మాట్లాడడం జరిగింది. అదేవిధంగా ఒక మనిషి ఆరోగ్యంగా ఉంటేనే ఎలాంటి పనైనా చేయడానికి వీలు ఉంటుంది. కాబట్టి ఈ వ్యాధిని దరిదాపుల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా 2047 సంవత్సరానికి భారతదేశానికి ఈ వ్యాధి నుండి బయట పడడానికి ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి హెల్త్ ఆఫీసర్స్‌కు మా సహకారం కూడా ఎల్లవేళలా ఉంటుందని జడ్పీటిసి దశరథ్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జెడి స్వాముజ్వాల, జాయింట్ డైరెక్టర్ పాల్గొన్నారు. విశిష్ట అతిథులుగా టిడబ్ల్యుడివి పద్మ, డిఎంహెచ్‌ఓ డా.గీత, హెచ్ఎంవి బాలరాజు, కృష్ణయ్య, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, హెల్త్ ఆఫీసర్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి బండి సంజయ్‌కు స్వాగతం పలికిన నాయకులు,కార్యకర్తలు

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఘన స్వాగతం

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జూన్ 19, ప్రభాతవార్త**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్ నగరం నుంచి తొలిసారిగ శామీర్‌పేట రాజీవ్‌రహదారి మీదుగా కరీంనగర్ వెళ్తుండగ మురహరిపల్లి వద్ద మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు ఘనంగ స్వాగతం పలికారు. బుధవారం ఉదయం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని మురహరిపల్లి గ్రామం వద్ద రాజీవ్‌రహదారిన మేడ్చల్ నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు చేరుకుని నగరం నుంచి కరీంనగర్‌కు వెళుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఘనంగ స్వాగతం పలికారు. మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు స్వాగతం పలికి సన్మానించి ఆయనకు అభినందనలు తెలియజేశారు. మురహరిపల్లి వద్దకు బిజెపి శ్రేణులు జిల్లా నుంచి, అదే విధంగ మేడ్చల్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున చేరుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఘనంగ స్వాగతం పలకటానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ బాధ్యతలు చేపట్టి తొలసారిగ రాజీవ్‌రహదారిన నగరం నుంచి కరీంనగర్ వెళ్తున్నట్లు సమాచారం అందుకున్న బిజెపి నాయకులు, కార్యకర్తలు సంతోషంతో ఉత్సాహంతో మంత్రి బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతూ నినాదాలు చేశారు. రాజీవ్‌రహదారి అంత బిజెపి నాయకుల సంబరాలు, హంగామాతో కళకళలాడింది. ఆ తరువాత రాజీవ్‌రహదారిన కాన్వాయ్‌తో కరీంనగర్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ వెళ్లారు. కేంద్ర మంత్రికి స్వాగతం పలికిన వారిలో జిల్లాకు చెందిన పలువురు బిజెపి నాయకులు, మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల బిజెపి నాయకులు, కార్యకర్తలు, శామీర్‌పేట మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



సికిల్‌సెల్ అనీమియా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి

## సికిల్ సెల్ అనీమియా వ్యాధి నివారణకు కృషి చేయాలి

### రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి

**మేడ్చల్, జూన్ 19, ప్రభాతవార్త :** సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూళనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా బుధవారంమేడ్చల్ పట్టణంలోని గిరిజన బాలుర వసతి గృహంలో సికిల్ సెల్ ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సికిల్ సెల్ అనీమియా పరీక్షలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వ్యాధి వంశపారంపర్యపరంగా సంక్రమిస్తుందని, ఈ వ్యాధి శరీరంలోకి ప్రవేశించి మెల్ల మెల్లగా నరాలని బలహీనపరుస్తుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారు బాధపడాల్సిన పని లేదని, ముందుగానే వ్యాధి లక్షణాలను గుర్తించి పరీక్షలు చేయించుకుని నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేకాధికారి సదా మాలోత్, డీటీడీవో ఇంచార్జి వినోద్ కుమార్, డాక్టర్ లావణ్య రెడ్డి, సీహెచ్‌వో మహాలమ్మ, ఎస్టీ కమిషన్ జిల్లా సభ్యుడు ధన్‌రాజ్ నాయక్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఫోర్జరీ దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేయవద్దని వినతి

### -దత్తాత్రేయనగర్‌లో తప్పుడు పత్రాలతో మోసం



సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ సంగీత

**ఘట్‌కేసర్, జూన్ 19, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ దత్తాత్రేయ నగర్‌లో కొందరు అక్రమార్కులు తప్పుడు పత్రాలు సృష్టించి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్ జగన్మోహన్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. సర్వేనంబర్లు 244, 245, 248, 288లోని దత్తాత్రేయనగర్ వెంచర్‌లో ప్లాట్ నంబర్లు 96, 411, 421లకు సంబంధించి కొందరు ఫోర్జరీ డాక్యుమెంట్ సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించుకొని ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బంది ఒరిజినల్ దస్తావేజులు పరిశీలించకుండా జిరాక్స్ పత్రాలు చేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని తెలిపారు. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేయడం అరికట్టకుంటే ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్ సంగీత ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

### నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి కేపీఆర్ఐటీ ఎంఓయు

**ఘట్‌కేసర్, జూన్ 19, ప్రభాతవార్త:** విద్యార్థులకు నైపుణ్యత అభివృద్ధి ద్వారా ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కేపీఆర్ఐటీ డైరక్టర్ కొమ్మూరి దివ్యశ్రీ అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు నైపుణాభివృద్ధి, ఉపాధి కోసం కేపీఆర్ఐటీ యాజమాన్యం, గ్రేడియస్ టెక్నాలజీస్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నది. ఈమేరకు కళాశాల డైరక్టర్ కొమ్మూరి దివ్యశ్రీ గ్రేడియస్ కో-ఫౌండర్ మధుసూధన్‌లు సంతకాలు చేసి ఒప్పంద పత్రాల (ఎంఓయూ)ను మార్చుకున్నారు.